నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, సోమవారం 30 సెప్టెంబర్ 2024 | NIZAMABAD

## రోడ్డు మార్గంలో జిల్లాకు..

ఆబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఉదయమే హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో మోర్తాడ్‌కు చేరుకుంటారు. ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించి భీమ్‌గల్‌కు చేరుకుని ఎక్సైజ్ భవనంతో పాటు పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. అక్కడి నుంచి ఆర్మూర్‌కు చేరుకుని ఎక్సైజ్ నూతన బిల్డింగ్‌ను ప్రారంభిస్తారు. ఆర్మూర్ నుంచి నిజామాబాద్ కలెక్టరేట్‌కు చేరుకుని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించున్నారు. అనంతరం హైదరాబాద్‌కు రోడ్డు మార్గంలో వెళ్లనున్నారని అధికారులు పేర్కొన్నారు.



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

**రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం** ఏర్పడిన తర్వాత ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం కరువైంది. దీంతో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్టవేయగా.. పాలన వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. పలు ప్రభుత్వ శాఖల్లో సమన్వయం కొరవడి గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మంత్రి పదవి లోటుతో జిల్లాలో అన్నింటికీ ఇన్‌చార్జి మంత్రి దిక్కుగా మారారు. మహబూబ్‌నగర్‌కు చెందిన ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించగా.. పది నెలల్లో చుట్టపు చూపుగా వచ్చి వెళ్లారు. ఉమ్మడి జిల్లా ప్రభుత్వ యంత్రాంగానికి ఇన్‌చార్జి మంత్రిగా ఆయన దిశా నిర్దేశం చేసింది శూన్యం. మూడుసార్లు ఇలావచ్చి అలా వెళ్లి మమ అనిపించారు తప్ప, యంత్రాంగంపై ఇప్పటి వరకూ పట్టు సాధించలేదు. ఏ ఒక్క అంశపైనా సమీక్ష నిర్వహించలేదు సరికదా.. కనీసం సలహాలు, సూచనలు ఇచ్చిన దాఖలాలు లేకపోవడం గమనార్హం.

–నిజామాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)




నేడు జిల్లాకు రానున్న ఇన్‌చార్జి మంత్రి

# జూపల్లికి సమస్యల స్వాగతం

- సుదీర్ఘ విరామం తర్వాత ఇందూరుకు..
- అమాత్యుడు లేక పాలన అస్తవ్యస్తం
- ఎక్సైజ్, పోలీస్ శాఖల్లో గందరగోళం
- వారంలో సీపీ బదిలీకి రంగం సిద్ధం?

**మంత్రి** కాని మంత్రి హోదాలో ఎమ్మెల్యేలు అధికార దర్పాన్ని చెలాయిస్తూ దూసుకుపోతున్నారు. దీంతో యంత్రాంగంలో అయోమయం ఏర్పడింది. ఎవరి మాట వినాలో, ఎవరి ఆదేశాలు పాటించాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఎలాంటి ముప్పును ఎదుర్కోవాల్సి వస్తుందోనని ప్రభుత్వ ఉద్యోగులంతా మిన్నకుండి పోతున్నారు. ప్రజాపాలనలో గందరగోళం చోటు చేసుకుంటున్న నేపథ్యంలో జూపల్లి కృష్ణారావు సుదీర్ఘ విరామం తర్వాత నిజామాబాద్ జిల్లా నేడు వస్తున్నారు. ఆర్మూర్, భీమ్‌గల్, మోర్తాడ్ పట్టణాల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖకు చెందిన నూతన భవనాన్ని ప్రారంభించేందుకు ఇన్‌చార్జి మంత్రి రాక సందర్భంగా పటిష్ట ఏర్పాట్లు చేశారు. ఆబ్కారీ శాఖ మంత్రి హోదాలోనే కాకుండా ఇన్‌చార్జి మంత్రిగానూ జూపల్లి పర్యటన ప్రాధాన్యం సంతరించుకున్నది.



### ఆబ్కారీ దారిలోకి వచ్చేనా...?

ఇన్‌చార్జి మంత్రి బాధ్యత వహిస్తున్న ఎక్సైజ్ శాఖలో తీవ్ర అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కల్లు డిపోల నిర్వాహకులతో అంటకాగుతూ ప్రజల ప్రాణాలను తోడేస్తున్నవైనం బహిరంగంగానే కొనసాగుతోంది. కొంత మంది ఉద్యోగుల్లో సత్ప్రవర్తన కొరవడింది. దీంతో నిజామాబాద్ జిల్లాలో ఏటా ఎవరో ఒకరు ఎక్సైజ్ ఉద్యోగి తీరుతో ఈ శాఖ పరువు పోతోంది. క్రమశిక్షణకు మారుపేరుగా ఉండాల్సిన యూనిఫార్మ్ సర్వీసులో ఈ రకమైన పరిస్థితిని దారిలోకి తెచ్చేందుకు ఆబ్కారీ మంత్రి ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారనే దానిపై ఆసక్తిగా నెలకొన్నది. తాజాగా వెలుగు చూసిన పరిణామాలపై ఇప్పటికే జూపల్లి కృష్ణారావు తీవ్ర స్థాయిలో కోపంతో ఉన్నట్లుగా తెలిసింది. మాక్లూర్ ఐఎంఎల్ డిపోలో వసూళ్ల దందా ఎక్కడా లేని విధంగా జరుగుతుండడంపైనా చర్చ జరుగుతోంది. లోడింగ్, అన్‌లోడింగ్ విషయంలో పైసా వసూళ్లపై వైన్‌షాపు ఓనర్లంతా ఏకమై ఫిర్యాదు చేయడంతో పరిస్థితి రచ్చ కెక్కింది. మరోవైపు వైన్ షాపులపై ఎక్సైజ్ శాఖ నిఘా అంతంత మాత్రంగానే ఉన్నట్లు ఆరోపణలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపులు కోకొల్లలుగా విస్తరిస్తున్నాయి. బంద్ సమయంలో వైన్ షాపుల్లోని సరుకు పెద్ద మొత్తంలో పక్కదారి పడుతోంది. అక్రమంగా డబుల్ ధరలకు అమ్ముకుని రెట్టింపు లాభాలకు వ్యాపారులు రుచి మరుగుతున్నారు. ఈ అక్రమ పద్ధతులకు శాఖలోని కొంత మంది సహకారం అందిస్తుండడంతో సామాన్యులు చితికి పోతున్నారు.

### బీఆర్‌ఎస్ సర్కారు నిర్మాణం..

**'కాంగ్రెస్' ప్రారంభోత్సవం..**

మోర్తాడ్, భీమ్‌గల్, ఆర్మూర్‌లోని ఎక్సైజ్ నూతన భవనాలను బిల్డింగ్‌లను ఆబ్కారీ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం ప్రారంభించనున్నారు.అయితే ఈ నిర్మాణాలను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే చేపట్టారు. కేసీఆర్ హయాంలోనే ఎక్సైజ్‌కు జవసత్వాలు కల్పించబడ్డాయి. నిధులు కూడా విడుదల చేయడంతో అసెంబ్లీ ఎన్నికల నాటికి పూర్తి స్థాయిలో నిర్మాణాలు జరిగాయి. పది నెలల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తుది మెరుగులు మాత్రమే దిద్దింది. కేసీఆర్ హయాంలో జరిగిన కృషికి కాంగ్రెస్ హయాంలో ప్రారంభోత్సవాలు జరుపుకుంటుండడంపై సంబంధిత శాఖలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. గత సర్కారు ఆబ్కారీ శాఖకు పెద్ద పీట వేసిన పరిస్థితిపైనా చర్చ జరుగుతోంది.

### రైతన్నకు భరోసా ఇచ్చేదెవరు?

పంట రుణమాఫీ విషయంలో ప్రభుత్వ తీరుపై రైతుల్లో ఆగ్రహం గూడు కట్టుకున్నది. రూ.2లక్షలోపు పంట రుణాలను రద్దు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ అమలుకాకపోవడంతో అన్నదాతలు నిజామాబాద్, కామారెడ్డిలో ఎదురు చూస్తున్నారు. వీరికి భరోసా ఇచ్చే నాథుడే కరువయ్యాడు. నిజామాబాద్ వ్యవసాయ శాఖలో ఆధిపత్య పోరుతో ఆ శాఖ పని తీరు సక్రమంగా లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉద్యోగుల మధ్య సఖ్యత లేకపోవడంతో రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. రుణమాఫీ విషయంలో రైతులకు సమాధానాలు ఇవ్వడంలోనూ వ్యవసాయ శాఖ విఫలమైందనే ఆరోపణలున్నాయి. క్షేత్ర స్థాయిలో ఏఈవోలు అందుబాటులో ఉండడం లేదు. వీరిపై డీఏవో పర్యవేక్షణ కరువైంది. వ్యవసాయ శాఖలో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ధాన్యం సేకరణ భారీ సవాల్‌తో కూడుకున్నది. వానకాలం వరి సాగు ముగింపునకు చేరుకోగా కొన్ని చోట్ల పంట చేతికి వస్తోంది. ఈ దశలో వడ్ల కొనుగోళ్లపై యంత్రాంగానికి దిశా నిర్దేశం చేసే వారు కరువయ్యారు. జూపల్లి కృష్ణారావు తన పర్యటనలో సాయంత్రం యంత్రాంగంతో సమీక్ష నిర్వహించనున్నారు. ఇందులో వడ్ల కొనుగోళ్లపై సమీక్ష ఉంటుందా? లేదా? అనే విషయంపై స్పష్టత లేదు. ప్రజాపాలనలో తొమ్మిది నెలల క్రితం వివిధ పథకాలకు దరఖాస్తు చేసుకున్న ప్రజలకు, మహాలక్ష్మి కింద ఉచిత గ్యాస్ సిలిండర్, గృహ జ్యోతి కింద 200 యూనిట్ల కరెంట్ పథకం అమలు కావడం లేదు. దీంతో సామాన్యులు ఆగమాగం అవుతున్నారు. ఆయా పథకాలకు అర్హులైన వారంతా తమను ఆదుకోవాలంటూ ప్రజావాణిలో ప్రతి సోమవారం ఫిర్యాదులు చేస్తున్నా.. వాటికి సమాధానం రావడం లేదు.

# ఆరోగ్య జీవితానికి క్రీడలు ఎంతో అవసరం

- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- భీమ్‌గల్‌లో క్రీడా పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే

భీమ్‌గల్, సెప్టెంబర్ 29 : ఆరోగ్యకర జీవితానికి క్రీడలు ఎంతో అవసరమని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కృషి హైస్కూల్ గ్రౌండ్‌లో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం మండల అంతర్ పాఠశాలల క్రీడాపోటీలు నిర్వహించగా.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వేముల హాజరయ్యారు. క్రీడాజ్యోతి వెలిగించి, విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. క్రీడలు మానసికోల్లాసం, ఆరోగ్యకరమైన జీవితం, భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడానికి ఎంతోగానో ఉపయోగపడుతాయన్నారు. క్రీడలు కేవలం ఫిట్‌నెస్ కోసమే కాకుండా జీవితంలో ఎదురుదెబ్బలు తగిలినప్పుడు వాటిని తట్టుకుని నిబ్బరంగా, మనోధైర్యంగా ఉండడానికి ఉపయోగపడుతాయని వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలు క్రీడల్లో పాల్గొనడమే అదృష్టంగా భావించాలని తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, రెండింటినీ సమానంగా స్వీకరించాలని సూచించారు. అప్పుడే క్రీడా స్ఫూర్తి విద్యార్థుల్లో అలవడుతుందన్నారు. తనతోపాటు చిన్నప్పుడు ఆడిన ఎందరో ఇప్పుడు జిల్లాలో ఫిజికల్ డైరెక్టర్లుగా ఉన్నారని, వారికి క్రీడలపై ఉన్న మక్కువతోనే జిల్లాలో గ్రామీణ స్థాయిలో గొప్పగా క్రీడా పోటీలు నిర్వహించుకోగలుతున్నామని తెలిపారు. గ్రామీణ స్థాయి నుంచి క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆడినవారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. తల్లి దండ్రులు ఎల్లప్పుడూ చదువు, మార్కులే కాకుండా పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలన్నారు. పోటీల నిర్వహణ కోసం బహుమతులు, ఇతర అవసరాలకు దాతగా ముందుకొచ్చిన పద్మ జగదీశ్‌ను అభినందించారు. తన తండ్రి దివంగత వేముల సురేందర్‌రెడ్డి 30 ఏండ్లుగా క్రీడల్లో రాణించారని తెలిపారు. అనంతరం మార్చ్‌పాస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలత, మాజీ జడ్పీటీసీ రవి, మున్సిపల్ వైస్‌చైర్మన్ భగత్, కౌన్సిలర్లు సతీశ్, లింబాద్రి, ప్రసా ద్, లింగయ్య, ఎంఈవో స్వామి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సయ్య, ఫిజికల్ డైరెక్టర్లు విద్యాసాగర్‌రెడ్డి, రమణ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రుణమాఫీపై తీర్మానాలు

### కొనసాగుతున్న విండో మహాజన సభలు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, సెప్టెంబర్ 29: రాష్ట్రప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులూ లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కొన్నిరోజులుగా జిల్లాలోని సహకార సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాజన సభల్లో రైతులందరికీ రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలంటూ ఏకగ్రీవ తీర్మానాలు చేస్తున్నారు. ఆదివారం కోటగిరి, ఎత్తొండ, సాలూర మండలం హున్సా, ముప్కాల్ మండలం రెంజర్ల విండోల్లో మహాజన సభలు నిర్వహించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని, దొడ్డు ధాన్యానికి కూడా రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పత్తిని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమ చేయాలని తీర్మానం చేశారు.

ధర్పల్లి మండలం ప్రాజెక్టు రామడుగులో గ్రామదేవతల శోభాయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్తులు



## ఊరంతా పండుగ

**జిల్లాలోని పలు గ్రామాల్లో** ఆదివారం ఊర పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామదేవతల విగ్రహాలను తయారుచేసి, డప్పుచప్పుళ్లు, పోతరాజుల విన్యాసాల మధ్య ప్రధానవీధుల గుండా ఊరేగించారు. గ్రామ పొలిమేరల్లోని గ్రామదేవతల ఆలయాల్లో విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. ఊర పండుగలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నాణ్యమైన ఆహారం అందించాలి

- విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించాలి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు
- పోచంపాడ్ గురుకుల పాఠశాలలో బస





విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు (ఇన్‌సెట్లో) వసతి గృహానికి తీసుకువచ్చిన కూరగాయలను పరిశీలిస్తూ..

ముప్కాల్, సెప్టెంబర్ 29: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించేలా అన్ని వసతులతోపాటు ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.మెండోరా మండలం పోచంపాడ్‌లోని ప్రభుత్వ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలను శనివారం రాత్రి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి రాత్రి గురుకులంలోనే బసచేశారు. ఆదివారం ఉదయం విద్యార్థుల రోల్–కాల్‌ను పరిశీలించారు. విద్యార్థుల కోసం తెచ్చిన పాలు, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. ఖోఖో ఆడేందుకు సిద్ధమైన విద్యార్థులను కలెక్టర్ పరిచయం చేసుకుని వారి ఆటను ఆసక్తిగా తిలకించారు. విద్యార్థులకు పలు సదుపాయాలు లేకపోవడాన్ని గమనించి, సంబంధిత రాష్ట్రస్థాయి అధికారులతో మాట్లాడారు. వాటిని సమకూర్చేలా చూస్తానని చెప్పారు. పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు వెచ్చిస్తున్నదని, నాణ్యమైన విద్య, పౌష్టికాహారాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. కలెక్టర్ వెంట పాఠశాల ప్రిన్సిపాల్ సురేందర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

# బిచ్కుందలో వృద్ధురాలు హత్య



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న బాన్సువాడ డీఎస్పీ, సీఐ

బిచ్కుంద, సెప్టెంబర్ 29: బిచ్కుంద మండల కేంద్రంలో ఓ వృద్ధురాలు హత్యకు గురైంది. ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలి మెడలో నుంచి బంగారు నగలు దోచుకునేందుకు వచ్చిన దుండగుడు హత్యచేసి పారిపోయాడు. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకోగా.. ఇందుకు సంబంధించి సీఐ జగడం నరేశ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బిచ్కుందలోని ఎస్సీవాడలో గోనె కాశవ్వ (65) తన కొడుకు, కోడలుతో కలిసి ఉంటున్నది. ఆదివారం కొడుకు, కోడలు వ్యవసాయ పనుల నిమిత్తం బయటికి వెళ్లారు. కాశవ్వ ఇంట్లో ఒంటరిగా ఉండడాన్ని గమనించిన ఓ గుర్తు తెలియని దుండగుడు .. ఇంట్లోకి చొరబడి ఆమె మెడలో ఉన్న బంగారు గుండ్లను తెంపివేశాడు. ఈ క్రమంలో దుండగుడిని అడ్డుకోవడానికి వృద్ధురాలు యత్నించగా..ఒక్కసారిగా ఆమె తలను గోడకేసి బాదాడు. దీంతో కాశవ్వ అక్కడికక్కడే మృతి చెందింది. కాసేపటికి ఇంటి ఎదురుగా ఉన్న భూదవ్వ పలుకరించడానికి రాగా.. కాశవ్వ రక్తపు మడుగులో పడి ఉండడం గమనించి వెంటనే స్థానికులకు తెలిపింది. వారు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో బాన్సువాడ డీఎస్పీ సత్యనా రాయణ, బిచ్కుంద సీఐ జగడం నరేశ్, ఎస్సై మోహన్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.




### 'భరోసా' ఇచ్చేదెప్పుడు?

**మహిళల భద్రత,** రక్షణ కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం షీ టీంలను ఏర్పాటు చేసింది. బాధితులకు సమగ్రమైన సహాయం, ఆపదలో ఉన్నవారికి సురక్షితమైన వాతావరణంలో చేయూత అందించడానికి జిల్లాల్లో భరోసా కేంద్రాలను నెలకొల్పింది. నిజామాబాద్ సీపీ కార్యాలయం వెనుకప్రాంతంలో భరోసా కేంద్ర ఏర్పాటు కోసం నూతన భవనం నిర్మించారు. రెండు నెలల క్రితం నిర్మాణం పూర్తిచేసుకున్న ఈ భవనం ఇప్పటివరకూ ప్రారంభానికి నోచుకోవడంలేదు. దీనిపై అధికారులను సంప్రదిస్తే తమకేమీ తెలియదని సమాధానమివ్వడం గమనార్హం.

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్